నెల్లూరులో ట్రాఫిక్ ఆంక్షలు

- రొట్టెల పండగ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు
- ఎస్పీ కృష్ణకాంత్



స్వర్ణాల చెరువు సమీపంలో నిలిపిన భక్తుల వాహనాలు

నెల్లూరు సిటీ: రొట్టెల పండగ నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయనున్నట్లు ఎస్పీ కృష్ణకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు పలు మార్గాలను మళ్లించినట్లు వివరించారు. బట్వాడిపాళెం సెంటర్, డీపీఏ జంక్షన్, కేవీఆర్ పెట్రోల్‌బంక్ జంక్షన్, పొదలకూరు రోడ్డు జంక్షన్‌ల వద్ద దర్గా వైపునకు వచ్చే వాహనాలకు తప్పనిసరిగా వెహికల్ పాస్‌లు ఉండాలన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

⇨ గూడూరు మీదుగా వచ్చే ఆర్టీసీ బస్సులను అయ్యప్పగుడి సెంటర్ నుంచి ఫ్లైఓవర్ మీదుగా బీవీనగర్, అన్నమయ్య సర్కిల్, ముత్తుకూరు రైల్వే అండర్ బ్రిడ్జ్, ఏసీ మార్కెట్, ఆర్టీసీ డిపోనకు డైవర్ట్ చేశారు.

⇨ పొదలకూరు రోడ్డు సర్కిల్ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను డైకస్‌రోడ్డు, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సర్కిల్ నుంచి అయ్యప్ప గుడి సర్కిల్ మీదుగా బీవీనగర్, ముత్తుకూరు రోడ్డు అండర్ బ్రిడ్జ్, ఏసీ మార్కెట్ మీదుగా ఆర్టీసీ డిపోనకు డైవర్ట్ చేశారు.

⇨ జొన్నవాడ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను పుట్టా ఎస్టేట్– ఎస్టీ జోసెఫ్ స్కూల్ మీదుగా బోసుబొమ్మ, గాంధీబొమ్మ, ఏసీ మార్కెట్ మీదుగా ఆర్టీసీ డిపోనకు డైవర్ట్ చేశారు.

⇨ బట్వాడిపాళెం నుంచి పోలీసు ఆఫీసు మీదుగా వెళ్లే వాహనాలను మూలాపేట వైపు నుంచి డైవర్ట్ చేశారు.

⇨ కేవీఆర్ పెట్రోల్ బంక్ నుంచి డీకేడబ్ల్యూ వైపు వెళ్లే వాహనాలకు అనుమతి లేదు.

⇨ 5 నుంచి 10వ తేదీ వరకు నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి లేదు.

పార్కింగ్ ప్రదేశాలివే..

⇨ గూడూరు వైపు నుంచి వచ్చే వాహనాలు డీ–మార్ట్ పక్కన పార్కింగ్ చేసుకోవాలి.

⇨ విజయవాడ, కావలి, కడప, ఆత్మకూరు, బుచ్చి వైపు నుంచి వచ్చే వాహనాలకు ఎస్‌వీజీఎస్ కళాశాల గ్రౌండ్స్‌లో పార్కింగ్ ప్రదేశం ఉంది.

⇨ జొన్నవాడ వైపు నుంచే వచ్చే వాహనాలకు డీఎస్‌ఎన్ మినీ ఫంక్షన్ హాల్ ముందు, వెనుక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు.

⇨ రాపూరు, పొదలకూరు నుంచి వచ్చే వాహనాలకు ఆలిండియా రేడియో స్టేషన్ వద్ద పార్కింగ్ స్థలం ఉంది.



ఎస్పీ కృష్ణకాంత్

మరుగుదొడ్ల నిర్వహణను పర్యవేక్షించండి

నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగలో నేపథ్యంలో పార్కింగ్ స్థలాల వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రొట్టెల పండగ సందర్భంగా వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలాలను, బయో మరుగుదొడ్లను కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని, ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా వాటిని శుభ్రం చేయాలని సూచించారు. దర్గా ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా నిరంతరం పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టడంతో పాటు రొట్టెలు మార్చుకునే నీటిలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించడం, అన్ని ప్రాంతాల్లో నిరంతరం తాగునీటి సదుపాయం కల్పించడం వంటి చర్యలను క్రమం తప్పకుండా సిబ్బంది చేపట్టాలని సూచించారు.



మరుగుదొడ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

డీకేడబ్ల్యూలో జాబ్ ఓరియంటేషన్

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జాబ్ ఓరియంటేడ్ ప్రోగ్రామ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు. ప్రస్తుత సమాజంలో సైన్స్ కోర్సుల్లో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి, ఆర్‌ఐఓ వరప్రసాదరావు, ప్రాజెక్టు డైరక్టర్ కృష్ణప్రసాద్, కిమ్స్ ఆసుపత్రి హెచ్‌ఆర్ పురుషోత్తం, కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

నెల్లూరు (టౌన్): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా తమ సంస్థ పనిచేస్తున్నట్లు జమాతే ఇస్లామి హింద్ నగరాధ్యక్షుడు సయ్యద్ నవీద్ అహ్మద్ తెలిపారు. స్థానిక జెండావీధిలోని పీఎస్‌ఎం స్కూల్, గంజిఖానాలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష మొక్కలు నాటే మహా ఉద్యమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అన్వర్ బేగ్, యాకూబ్, ఇలియాజ్ హుమాయూన్, అబ్దుల్‌హసన్, అమీరా, మస్తక్, ఆయేషా ఖాతున్, సఫియా అక్తర్, అఫ్రోజా పాల్గొన్నారు.



కూటమి విధానాలతో పెన్షనర్లకు నష్టం

- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(బృందావనం): ప్రస్తుత కూటమి ప్రభుత్వ విధానాలు పెన్షనర్లను నష్టపరిచే విధంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక బీవీనగర్‌లోని పెన్షనర్ల భవనంలో సర్వసభ్య, కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫైనాన్స్ బిల్ 2025తో పెన్షనర్లకు ఎటువంటి పెన్షన్ పెరుగుదల ఉండదని, ఈ విధానాల పట్ల పెన్షనర్లు ఐక్యతగా సాగి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం గౌస్ పెన్షనర్లకు ఫైనాన్స్ బిల్ 2025తో తలెత్తే సమస్యలను వివరించారు. జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ అధికారి డి.గంగాద్రి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. అనంతరం గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన అసిస్టెంట్ ట్రెజరీ అధికారి అహ్మద్ దంపతులను సన్మానించారు. అలాగే బదిలీ అయిన ట్రెజరీ సీనియర్ అకౌంట్స్ అధికారి యుగంధర్, ఎస్టీఓ అఫ్రోజ్‌బాషాలను కూడా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత టీచర్ పి.బాబురెడ్డి, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్పీవీఎస్ మూర్తి, ఉపాధ్యక్షులు గురునాథం, ఖాసీం, గోపాల్, వీరేంద్రనాథ్, కోశాధికారి జె.హజరత్తయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రమణయ్య, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.శ్రీనాథ్, కార్యదర్శి సీహెచ్.రఘునాథ్ పాల్గొన్నారు.



విశ్రాంత ఏటీఓ అహ్మద్ దంపతులను సన్మానిస్తున్న పెన్షనర్లు

రూ.50 వేల విరాళం అందజేత

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం గేట్ వనంతోపు సెంటర్‌లో ఉన్న జనహిత, వాత్సల్య బాలల, వృద్ధుల ఆశ్రమ కేంద్రంలో హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ సీఎస్ శ్రీనివాసరాజు పుట్టినరోజు వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రూ.50 వేల విరాళాన్ని నిర్వాహకుడు జీవీ సాంబశివరావుకు అందజేశారు. అలాగే కేంద్రంలోని 80 మంది విద్యార్థులకు రెయిన్ కోట్లు, విద్యా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, మానవ సేవే మాధవసేవ బృంద సభ్యులు జీవీ పుల్లారెడ్డి, పరిమళ, శ్రీనివాసరాజు సతీమణి సి.రమాదేవి, కుటుంబసభ్యులు నందకిశోర్, బాబ్జి, హేమలత, ఆశ్రమ నిర్వాహకులు మల్లికార్జున, గిరి తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

జాతీయ సదస్సులో డిప్యూటీ మేయర్



నెల్లూరు(బారకాసు): గురుగ్రామ్ వద్ద గురు, శుక్రవారాల్లో జరిగే పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధుల జాతీయ స్థాయి సమావేశంలో నగరపాలక సంస్థ నుంచి డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్ పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా ప్రారంభించిన కార్యక్రమంలో హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ హాజరయ్యారు.

సమతకు డాక్టరేట్



సమత

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న వి.సమతకు డాక్టరేట్ లభించింది. ద్రవిడియన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ఎంవీ శ్రీనాథ్ పర్యవేక్షణలో కంపోనెంట్ బేస్డ్ మల్టీ అట్రిబ్యూట్ రిస్ట్రిక్షన్ మోడల్ ఫర్ ప్రైవసీ ప్రొటెక్షన్ ఇన్ వెబ్ కొలాబరేషన్ ఫర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ అనే అంశంపై పరిశోధన గావించినందుకు వర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గిరితో పాటు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అరుణమ్మ

నెల్లూరు సిటీ: అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు విడుదల చేశామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. చింతారెడ్డిపాళెంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి అవగాహన

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ఉండాలని పేర్కొన్నారు. బస్టాండ్ ప్రాంగణానికి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డిపో–1 మేనేజర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ల్యాబ్ పరీక్షలు పక్కాగా ఉండాలి

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో పనిచేస్తున్న టెక్నీషియన్లు ల్యాబ్‌లలో రక్త, గళ్ల పరీక్షలను పక్కాగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని మలేరియా విభాగం రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఏటీ రామారావు అన్నారు. నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ ల్యాబ్ టెక్నీషియన్ల సమీక్షా సమావేశంలో ఆయన గురువారం పాల్గొని, మాట్లాడారు. వ్యాధుల స్క్రీనింగ్ కోసం వైద్యశాఖ ప్రోటోకాల్‌ను పాటించాలని కోరారు. అనంతరం అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలను నూరు శాతం చేయాలని తెలిపారు. మలేరియా సహాయాధికారి నాగార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

దర్గా ప్రాంగణంలో నిరంతర విద్యుత్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రొట్టెల పండగ నేపథ్యంలో దర్గా ప్రాంగణంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అన్నారు. ఆయన బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిరంతర విద్యుత్ సరఫరా కోసం దర్గా ప్రాంగణంలో విద్యుత్‌శాఖ స్టాల్‌ను ఏర్పాటు చేసి 15 మంది డీఈఈలు, 22 మంది ఏఈఈలు, 150 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఆయన వెంట ఈఈ శ్రీధర్, ఈఈ అశోక్, ఏఈ లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు.

మద్యపానాన్ని నిషేధించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో మద్యపానాన్ని నిషేధించాలని, మహిళల పురోగతికి ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. 16వ డివిజన్‌లో గురువారం జరిగిన నగర ఐద్వా మహాసభలో ఆయన హాజరై, మాట్లాడారు. మహిళల సమస్యలపై పోరాడేందుకు ఐద్వా ముందుంటుందని కొనియాడారు.

‘రంగడి’ సన్నిధిలో విశేష పూజలు రేపు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానంలో స్వామి వార్లకు శనివారం ఉదయం తిరుమంజనం జరుగనుందని ఈఓ ఎ.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు గరుడసేవ, శ్రీపెరియాళ్వార్లకు గజవాహన సేవ పేట ఉత్సవం ఉంటుందన్నారు.

కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలకు వినతి

నెల్లూరు (టౌన్): ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలకు కేంద్ర బిందువులుగా మారిన కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బీసీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఉల్లిపాయల మురళీకృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో ఆర్‌ఐఓ వరప్రసాదరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓ ప్రైవేటు కళాశాలలో రేవంత్ అనే విద్యార్థి చనిపోవడం బాధాకరమన్నారు. తన రూమ్‌లో ఇబ్బందులు ఉన్నాయని, దీనిని మార్చాలని చెప్పినా ప్రిన్సిపాల్ పట్టించుకోలేదన్నారు. కార్పొరేట్ కళాశాలల్లో అధిక ఫీజుల దోపిడీ, ముందుగానే 40 శాతం ఫీజుల చెల్లింపు, పుస్తకాల విక్రయాలపై అనేక మార్లు ఆర్‌ఐఓను కలిసి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కళాశాలల్లో మోటివేషన్ క్లాసులు జరపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతియాదవ్, ప్రవీణ్, విజయ్, బాబూరావ్, తులసీరాం పాల్గొన్నారు.



ఆర్ఐకు వినతిపత్రం అందజేస్తున్న బీసీఎస్‌ఎఫ్ నేతలు

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ నగరాధ్యక్షుడు, కార్యదర్శి శ్రీనివాసులు, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో అఖిలభారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెలో అన్నిరంగాలకు చెందిన కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలన్న ప్రధాన డిమాండ్లతో సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. అసంఘటిత, రవాణా రంగ, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 9వ తేదీ నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మూలం ప్రసాద్, రాంబాబు, సుధాకర్, సూర్యనారాయణ, కామాక్షమ్మ, రజనీ, బసవయ్య, ఈశ్వరయ్య, రాజ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు

సారూ.. చదువు చెప్పండి

- పాఠశాలలో చేర్చుకోవాలని ప్రాథేయపడిన చిన్నారులు

నెల్లూరు(బారకాసు): వీఆర్ స్కూల్లో మమ్మల్ని కూడా చేర్చుకుని చదువు చెప్పండి సారూ.. అంటూ పెంచలయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు చిన్నారులు ప్రాథేయపడిన తీరు ప్రతిఒక్కరినీ కలచివేసింది. తల్లిదండ్రులు లేని వీరు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాత్రిపూట ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్‌లలో నిద్రపోతుంటారు. ఈ క్రమంలో గురువారం పాఠశాల పరిశీలనకు కమిషనర్ నందన్ రాగా ఆయన వద్దకు వారు నేరుగా వచ్చి చేతులు కట్టుకుని దీనంగా నిలబడ్డారు. ‘మాలాంటి వాళ్లకు కూడా చదువు చెప్తారని బయట చెబుతుంటే ఇక్కడికి వచ్చాం సార్.. మమ్మల్ని కూడా చేర్చుకోండి సారూ..’ కమిషనర్‌ను ప్రాథేయపడ్డారు. వారి మాటలకు చలించిన కమిషనర్ పిల్లలతో మాట్లాడుతూ మీ కోసం రూపొందించిన మీ పాఠశాలలో నిర్భయంగా చేరండి అంటూ తన ఫోన్ నంబర్‌ను తెల్ల కాగితంపై రాసి, పిల్లల చేతికి అందించి పంపించారు. అనంతరం ప్రిన్సిపల్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులతో కమిషనర్ మాట్లాడి పాఠశాలలో తరగతుల నిర్వహణ గురించి విచారించారు.



కమిషనర్‌ను కలిసి స్కూల్‌లో అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్న చిన్నారులు

బెదిరించి ఫోన్‌పే చేయించుకున్న నిందితుల అరెస్ట్

నెల్లూరు సిటీ: కత్తితో బెదిరించి నగదును ఫోన్ పే చేయించుకున్న ఇద్దరు నిందితులను వేదాయపాళెం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. గత నెల 25వ తేదీ వనంతోపు సెంటర్ వద్ద ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్సర్‌ను ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి, రూ.1000లను ఫోన్ పే చేయించుకున్నారు. దీంతో అతను బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొండాయపాళెం హరిజనవాడకు చెందిన గల్లా విల్సన్, రౌడీషీటర్ గిద్దలూరు గోవర్ధన్ అలియాస్ గోవాలను పడారుపల్లిలో గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కత్తి, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసై ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన ఎస్సై విజయకుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

ఆత్మీయ సన్మానం



నెల్లూరు(పొగతోట) : పంచాయతీరాజ్‌శాఖలో ఏఈగా పదవీ విరమణ చేస్తున్న మున్వర్ సన్మాన సభను జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో 35 ఏళ్ల పాటు ఉత్తమ సేవలందించడమే కాకుండా డిప్లొమో ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకుడిగా సిబ్బంది సమస్యల పరిష్కారానికి మున్వర్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అనంతరం మున్వర్ దంపతులను సన్మానించారు. డిప్లొమో ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర, జిల్లా అధ్యక్షుడు ఎం.బాబురావు, స్టేట్ జేఏసీ చైర్మన్ సంగీతరావు, సంఘ రాష్ట్ర గౌర వాధ్యక్షుడు రియాజ్ అహ్మద్, గౌరవ సలహాదారు హనుమంతరావు, రిటైర్డ్ ఎస్‌ఈలు శివారెడ్డి, చంద్రశేఖర్, షౌకత్‌అలీ, ఈఈ సుబ్బరాజు, కేశవులు పాల్గొన్నారు.

9న ధర్నా

నెల్లూరు (అర్బన్): ఆప్కాస్‌ను రద్దు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేటు ఏజెన్సీల ద్వారా నియమించాలన్న ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ ఈనెల 9న ధర్నాను నిర్వహించనున్నటు యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సతీష్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధవికి ధర్నాకు సంబంధించి నోటీసును గురువారం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, సంధానిబాషా పాల్గొన్నారు.

అనధికార మద్యాన్ని కొనుగోలు చేయొద్దు

నెల్లూరు సిటీ: పార్టీలు, వివాహాలు, సామూహిక వేడుకలకు కొందరు తక్కువ ధరకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారని, అలాంటి అనధికార మద్యాన్ని కొనుగోలు చేయవద్దని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తుల వద్ద మద్యం కొనుగోలు ప్రమాదకరమన్నారు. నకిలీ మద్యం సరఫరా కావచ్చని తెలిపారు. అలాంటి అనుమానిత వ్యక్తుల వివరాలు తెలిస్తే 14405, 94409 02509 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు సిటీ: ఇంటి నుంచి వెళ్లిన భర్త తిరిగి రాలేదని భార్య వేదాయపాళెం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. ఆర్టీఓ కార్యాలయానికి సమీపంలో నివాసం ఉండే అక్షయ్‌కుమార్, నవ్య దంపతులకు ఓ కుమారుడు ఉన్నారు. అటవీశాఖ కార్యాలయంలో పనిచేసే అక్షయ్‌కుమార్ గత నెల 30న ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి తన ఏటీఎం కార్డును తీసుకుని బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేసీకి వినతి

నెల్లూరురూరల్: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని భారత రాజ్యాంగ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు జేసీ కార్తీక్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. షకీల్, జాకీర్, రషీద్, అన్వర్‌బేగ్, సంధానిబాషా, నవీద్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తే చర్యలు

నెల్లూరు(బృందావనం): దేవదాయశాఖ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా దేవదాయశాఖ అధికారి, సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని ఆయన గురువారం చెప్పారు. దేవదాయశాఖ భూమిని ఆక్రమిస్తే మూడు నుంచి ఎనిమిదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందన్నారు.


న్యాయం చేయండి

నెల్లూరు సిటీ: నా స్థలంలో గోడ నిర్మించుకుంటే కేసు పెట్టారని, రెవెన్యూ అధికారులు, పోలీసులు పరిశీలించి న్యాయం చేయాలని స్థల యజమానులు దుర్గాప్రసాద్‌రెడ్డి, భాస్కర్ నాయుడు, బుడిగి చిన్నప్పరెడ్డి తెలిపారు. రూరల్ మండలంలోని కొండ్లపూడి పంచాయతీ దొడ్ల డెయిరీ ఎదురుగా ఉండే వివాద స్థలంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సర్వే నంబర్ 19లో తమకు చెందిన వ్యవసాయ భూమి ఉందన్నారు. వాటిల్లో కొంత 2008లో దువ్వూరు విజయకుమార్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డిలకు విక్రయించినట్లు తెలిపారు. 2009లో శ్రీవల్లికి 1.40 ఎకరాలను విక్రయించామన్నారు. దీనిపై ఆమెకు హద్దులు చూపించినా పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. దీనిని పరిశీలించి తగిన న్యాయం చేయాలని కోరారు.

పనులను వేగవంతం చేయండి

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని అధికారులు, సచివాలయ కార్యదర్శులను కమిషనర్ నందన్ ఆదేశించారు. వారాంతపు సమీక్షలో భాగంగా హౌసింగ్, టిడ్కో విభాగాధికారులతో కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. హౌసింగ్ ఈఈ మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతు జానీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చప్పరోత్సవం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చప్పరోత్సవం, రాత్రి రాజసూయ యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా తీకనం నాగరాజు– అనూరాధ, రేరాజు– లక్ష్మీమోక్షతేజ దంపతులు, కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ జానకి పాల్గొన్నారు.